క్లుప్తంగా

రెండో ఎంఈఓగా పుల్లయ్య



సామర్లకోట రెండో ఎంఈఓను అభినందించిన ఎంఈఓ, ఉపాధ్యాయులు

సామర్లకోట: మండల పరిధిలో రెండో మండల విద్యాశాఖ అధికారిగా పట్టపగలు పుల్లయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిధిలో ఎంఈఓలు పాలన పరమైన బాధ్యతలతో పాటు నాడు–నేడు, మధ్యాహ్న భోజన పథకాలను పరిశీలించడం కష్టంగా ఉంటుందనే వాదనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈఓలను నియమించాలని నిర్ణయించిన విషయ విదితమే. ఈ మేరకు ఏపీఎంలకు శిక్షణ ఇచ్చిన విషయం విధితమే. దీనిలో భాగంగా రెండో ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన పుల్లయ్యను ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు కలిసి అభినందించారు.

గూడ్స్ గార్డులుగా రైల్వే ఉద్యోగులకు శిక్షణ



శిక్షణకు హాజరైన స్థానిక రైల్వే ఉద్యోగులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో సుమారు మూడు నుంచి నాలుగేళ్ల పాటు రైల్వే పాయింట్ల మేన్‌లుగా పని చేసిన ఆరుగురు ఉద్యోగులకు గూడ్స్ గార్డులుగా ఎంపిక అయిన విషయం విదితమే. గూడ్స్ గార్డులుగా ఎంపికైన ఎస్.శంకరరావు, ఎల్.సతీష్ కుమార్, వై.సూరిబాబు, పి.విజయకుమార్, రంజన్‌కుమార్, డి.అప్పారావులకు సోమవారం నుంచి సికింద్రాబాద్‌లో శిక్షణ ప్రారంభమైందని స్థానిక స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ స్థానిక విలేకర్లకు తెలిపారు.

వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాస్

పెద్దాపురం: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల బకాయిలు సత్వరమే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలో కాండ్రకోట, మర్లావ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీలో 200 పని దినాలు కావాలని డిమాండ్ చేస్తే 50 పనిదినాలు కల్పిస్తున్నారన్నారు. ఉపాధి పనులు చేపట్టి 15 రోజులు కావాస్తున్న కూలీ డబ్బులు ఇవ్వడం లేదన్నారు. సత్వరమే బకాయిలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నీలపాల సూరిబాబు, సత్యనారాయణ, కోరా రాజు, మోసే తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామివారి తొలి అభిషేకం, పూజలను తిలకించడానికి బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలి పూజ చేశారు. తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం తరుపున అన్నదానం చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. పూజలు అనంతరం సాయంత్రం స్వామివారిని అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయంలోని ఉప ఆలయాలోను అర్చకులు పూజలు నిర్వహించారు.

ఇక నిఘా నీడలో..

- దేవాలయాలు, ప్రార్థన మందిరాల రక్షణకు ప్రత్యేక చర్యలు
- ఆలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు
- గ్రామాల్లో రక్షణ దళాల నియామకం



కొత్తపల్లిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వేణుగోపాలస్వామి ఆలయం

కొత్తపల్లి: గ్రామాల్లోని ఆలయాలు, ప్రార్థన మందిరాల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతర్వేదిలో రథం దగ్ధమైంది. ఇటువంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆలయాలు, ప్రార్థన మందిరాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీనిలో భాగంగానే అన్ని ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వహించారు. ఈ మేరకు పోలీసులకు ఆలయ కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆలయాలతో పాటు వాటికి అనుసంధానంగా ఉన్న రథాలు, ఉత్సవాల్లో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగించే పలు వాహనాల భద్రతపై నిర్వాహకులకు సూచనలు చేస్తున్నారు.

మండలాల వారీగా ఆలయాలు వివరాలు

మండలం	ఆలయాలు	చర్చిలు	మసీదులు
కొత్తపల్లి	149	108	3
గొల్లప్రోలు	65	41	3
పిఠాపురం	170	90	5
మొత్తం	384	239	11



ఉప్పాడలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన చర్చి



పొన్నాడలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన బషీర్‌బీబీ ఆలయం

దేవదాయశాఖ ఆధీనంలో లేని ఆలయాలు, ప్రార్థన మందిరాల నిర్వాహకులతో ఇప్పటికే పోలీసులు సమావేశాలు నిర్వహించారు. ఆలయాల రక్షణకు కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు పదే పదే చెబుతున్నారు. అంతే కాకుండా గ్రామంలో ఉత్సాహవంతులైన యువకులతో పోలీసులు గ్రామ రక్షక దళాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రక్షణ దళాల సభ్యులు రాత్రి సమయంలో ఆలయాల వద్ద భద్రతను పరిరక్షిస్తారు.

నియోజకవర్గంలో ఇలా..

పిఠాపురం నియోజక వర్గంలో ప్రసిద్ధి చెందిన ఆలయాలు ఉన్నాయి. దక్షిణ కాశీగా పిలిచే కుక్కుటేశ్వర స్వామి ఆలయం, దత్తాత్రేయ క్షేత్రం, పురూహూతికా అమ్మవారు, శ్రీసంస్థానం, గొల్లప్రోలు మండలం తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, అపర్ణాదేవి ఆలయాలు, కొత్తపల్లి మండలం గోర్సలో పురాతన రామాలయం, కొండెవరం, కోనపాపపేటలో వేంకటేశ్వరస్వామి, రమణక్కపేటలో విజయజనార్ధనస్వామి, కొత్తపల్లిలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, పొన్నాడలో బంగారు పాప (బషీర్‌బీబీ)తో పాటు పలు ఆలయాలు ఉన్నాయి.

వీటిలో కొన్ని ఆలయాలు దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్నాయి. భద్రత కోసం దేవదాయ శాఖ పర్యవేక్షణలో రక్షణ చర్యలు చేపడుతున్నారు. నియోజక వర్గంలో ఆలయాల, చర్చిలు, మసీదులు వెరసి సుమారు 634 ఉన్నాయని పోలీసులు తెలిపారు.

> **గ్రామస్తులు సహకరించాలి**
>
> గ్రామాల్లోని ఆలయాల వద్ద అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను గ్రామస్తులు విచారించాలి. అనుమానం వస్తే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలి. నియోజకవర్గంలోని సుమారు 30 ఆలయాల వద్ద కెమెరాలు ఏర్పాటు చేసాం.
>
> వైఆర్‌కే శ్రీనివాస్, సీఐ, పిఠాపురం

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే దొరబాబుకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

పిఠాపురం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గానికి చెందిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య సభ్యులు సోమవారం ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు వినతి పత్రం అందజేశారు. వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పిఠాపురం, యు.కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాలకు చెందిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



అమీనాబాదులో రోగికి కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

కొత్తపల్లి: అమీనాబాదు గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సక్కా మణికంఠబాబు ఆధ్వర్యంలో కాకినాడ జయంతి కంటి ఆసుపత్రి వైద్యులు 183 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

‘జగనన్న సురక్ష’పై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్

పిఠాపురం: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గొల్లప్రోలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం వార్డు సెక్రటరీలకు జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీకి సంబంధించి అర్హులైన, అవసరం ఉన్న దరఖాస్తుదారులను వలంటీర్లు గుర్తించాలన్నారు. దరఖాస్తుల్లో తేడాలను వెంటనే పరిశీలించాలన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి తమ సచివాలయాలు పరిధిలో ఎటువంటి రుసుము చెల్లించకుండా అర్హులకు ఉచితంగా సర్టిఫికెట్లను అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ ఎంవీ రామ్‌ప్రసాద్, వార్డు సెక్రటరీలు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ను విజయవంతం చేయండి

పెద్దాపురం: వచ్చే నెల నుంచి ప్రతి గ్రామంలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని పెద్దాపురం ఎంపీడీఓ అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని జి.రాగంపేట, వడ్లమూరు, గోరింట, పులిమేరు, చదలాడ, దివిలి తదితర గ్రామాల వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అశోక్ మాట్లాడుతూ ప్రతి ఒక్క లబ్ధిదారుడికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.

నెల రోజుల పాటు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని ఎంపీడీఓ అశోక్ అన్నారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఈశ్వరరావు, కళా, రమేష్, ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి పథకాలతో లబ్ధి



ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని వివరిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- ఆనూరు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’కు అనూహ్య స్పందన

పెద్దాపురం : రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం పెద్దాపురం మండలంలోని ఆనూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ అణితారాణి, సింగన త్రిమూర్తులు, కూనపురెడ్డి స్వామిల ఆధ్వర్యంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, గృహసారథుల మండల కన్వీనర్ గోపు మురళి, సింగన శివలతో కలిసి సుమారు మూడున్నర గంటల పాటు గ్రామంలోని ప్రతి గడపనూ సందర్శించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న పథకాల అమలుపై అడిగి తెలుసుకున్నారు. వారు ప్రభుత్వం నుంచి పొందుతున్న లబ్ధిని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అక్కడి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేయడంతో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. అనంతరం హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందజేయడానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ‘గడపగడపకూ మన ప్రభుత్వం’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మహిళాభివృద్ధి, రైతు సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలును అమలు చేస్తామన్నారు. పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొత్త చక్రరావు, ఎంపీటీసీ రాయి వెంకటేశ్వరరావు, నల్లల గోవిందు, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించండి



ఎమ్మెల్యే దొరబాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఎంఈవోలు

పిఠాపురం: నియోజకవర్గంలో పాఠశాలల అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబును మండల విద్యాశాఖాధికారులు (ఎంఈవోలు) కోరారు. ఇటీవల కొత్తగా నియమితులైన గొల్లప్రోలు, పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాల ఎంఈఓ–2లు బీవీ శివప్రసాద్, కేటీ నారాయణదాసు, జి.పైడిరాజు సోమవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. రెండో దశ నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసి మూడో దశ నిర్మాణాలకు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. కార్యక్రమంలో పిఠాపురం ఎంఈవో ఆర్‌వీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వాహనాలను అడ్డుకున్న లారీ యూనియన్ సభ్యులు



గోదుముల లోడ్ వాహనాలను అడ్డుకున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని జ్యోతుల గోదాములు (వేర్ హౌస్ గోదాములు) నుంచి పెద్దాపురం మండలం దివిలి సివిల్ సప్లయ్ గోదాములకు వెళుతున్న లోడ్ వాహనాలను స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం అడ్డుకున్నారు. జ్యోతుల గోదాముల నుంచి సరకు రవాణా చేయడానికి శివప్రసాద్ అనే వ్యక్తి కాంట్రాక్టరు తీసుకున్నాడు. కాంట్రాక్టరు తన సొంత వాహనాలలో గోదుముల రవాణా చేయడం సరికాదని, దీని కారణంగా పట్టణ పరిధిలోని లారీలకు కిరాయి లేకుండా పోతోందని లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆరోపిస్తూ వాహనాలను అడ్డుకున్నారు. దాంతో కాంట్రాక్టరు శివప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకొని ఇరువర్గాలతో చర్చించారు. గతంలో కూడా ఇదే సమస్య వచ్చిన సమయంలో 50 శాతం వాహనాలు స్థానిక లారీ యూనియన్‌కు అప్పగించడానికి అంగీకరించారని లారీల యజమానులు తెలిపారు. లారీ ఓనర్ల అసోసియేషన్‌పై ఆధారపడి అనేక మంది జీవిస్తున్నారని లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బినీడి దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానికంగా రవాణా జరిగే సమయంలో లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు కనీసం 50 శాతం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వ హైస్కూళ్లకు డిమాండ్



సామర్లకోట బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో సీట్ల కోసం వేసి ఉన్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు

సామర్లకోట: ప్రస్తుత విద్యా సంవత్సరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ హైస్కూల్స్‌కు డిమాండ్ పెరిగింది. ఈ మేరకు ఆరో తరగతి, 8వ తరగతిలో కొత్తగా చేరడానికి ఆయా ప్రభుత్వ హైస్కూళ్ల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో బారులు తీస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్, బీబీ ఆర్ హైస్కూల్‌తో పాటు ప్రభుత్వ హైస్కూల్, జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో సీట్ల కోసం విద్యార్థులు తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులతో సిపార్సులు చేయించుకుంటున్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆరు, 8వ తరగతిలో సీట్ల కోసం మరింత ఎక్కువగా డిమాండ్ ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ హైస్కూల్స్‌లో స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేసి వాటి ద్వారా విద్యాబోధన చేయడానికి ఏర్పాట్లు చేస్తుండడంతో ఆయా పాఠశాలలో చేరడానికి విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. ఇప్పటి వరకూ 8వ తరగతిలో రెండు సెక్షన్లకు 135 మంది, ఆరో తరగతిలో 80 మంది చేరినట్టు సోమవారం బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు.

విద్యుత్ వైర్ల సమస్యను పరిష్కరించాలి



విద్యుత్‌శాఖ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న అంజిబాబు తదితరులు

పిఠాపురం: గొల్లప్రోలు నగరపంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు కుంచే అంజిబాబు ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ఎందరో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న జగనన్న కాలనీలో 11 కేవీ విద్యుత్ లైన్ ప్రమాద భరితంగా మారిందన్నారు. గృహాలు నిర్మించుకుంటున్న వారికి ఈ వైర్లు ఇబ్బందికరంగా ఉన్నందున వీటిని మార్పు చేయాలని గతంలో కోరామన్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆందోళన బాట పట్టామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, డివిజన్ నాయకులు వి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సత్వర సేవలకు ‘డయల్ యువర్ కమిషనర్’



డయల్ యువర్ కమిషనర్‌లో సమస్యలు వింటున్న కమిషనర్ సురేంద్ర

పెద్దాపురం: పుర ప్రజలకు సత్వర సేవలందించేందుకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం దోహదపడుతుందని పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ జంపా సరేంద్ర అన్నారు. ప్రతి వారం నిర్వహించే డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం పలు ఫిర్యాదులు అందాయి. మెయిన్‌రోడ్డులో పార్కింగ్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రోడ్ల మీదకు షాపులకు ఎదురుగా వాహనాలు ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులున్నాయని, పలు సమస్యలపై పుర ప్రజలు డయల్ యువర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ సురేంద్ర స్పందిస్తూ సంబంధిత పోలీస్ శాఖ దృష్టికి తీసుకువెళ్లి పార్కింగ్ ఇబ్బందులపై చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జ్యోతిరాణి, టీపీఓ ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆర్ఓ రాజశేఖర్, డీఈ ఆదినారాయణ, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి స్పందనకు 14 అర్జీలు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రతి వారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయా మండలాల నుంచి 14 అర్జీలు అందినట్టు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. మా భూమికి పట్టాదారు పాస్ పుస్తకం కావాలని, భూ తగాదా పరిష్కరించాలని, జగపతినగరం గ్రామంలో ఆక్రమణలు తొలగించాలని, భూ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని తదితర సమస్యలపై 14 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ వెల్లడించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. స్పందనలో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉంటుందని, ఈ వారం వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించామని ఆర్డీఓ సీతారామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలామణి, పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవ కుమార్, రవిశంకర్, ప్రసాద్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో మరిన్ని విజయాలకు కృషి చేయాలి



పూజితను అభినందిస్తున్న వీర్రాజు తదితరులు

పెద్దాపురం: విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని విజయావకాశాలకు కృషి చేయాలని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు అన్నారు. విశాఖపట్టణంలో నిర్వహించిన కరాటే పోటీల్లో ప్రతిభ కనపర్చిన కరాటే టీచర్ పూజిత, సూర్యశ్రీ, విద్యార్థులను సోమవారం స్థానిక సూర్యారావు భవనంలో ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా పీసీసీ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో వీర్రాజు మాట్లాడుతూ పీసీసీ పేరిట వేసవి శిక్షణలో ఇచ్చిన కరాటే తర్ఫీదు మంచి విజయ అవకాశాన్ని ఇచ్చిందన్నారు. విద్యార్థులు మరింత పట్టుదలతో విజయాలను సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బి.అనంతరావు, డి.క్రాంతికుమార్, కూనిరెడ్డి అరుణ, డి.కృష్ణ, రొంగల వీర్రాజు, నరేష్ పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు

కొత్తపల్లి: వైఎస్సార్ కడప జిల్లాలోని క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండలస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్టు ఈఓపీఆర్డీ భాస్కరరావు సోమవారం తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి ఈ నెల 23న కాకినాడలో జిల్లాస్థాయి ఎంపిక నిర్వహిస్తారన్నారు. ఈ ప్రవేశాలకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట పుట్టిన తేదీకి సంబంధించిన ధ్రువీకరణ పత్రం, పాసుపోర్టు సైజు ఫోటో, ఆధార్‌కార్డు తప్పని సరిగా తీసుకురావాలని సూచించారు.